క్లుప్తంగా

చెర్లోపల్లిలో అనుమతి లేని టపాసుల షాపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి నేతల అండతో చిత్తూరు మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో శనివారం ఓ టపాసుల షాపునకు దీపావళి దమాకా ఇచ్చారు. ఎలాంటి అనుమతి లేకుండా రెవెన్యూ అధికారులు షాపు నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. షాపు విషయం కార్యాలయంతా తెలియడంతో ..ఓ అధికారి ఆ షాపును పట్టించుకోకుండా వదిలేయమని కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఇది తెలిసినా కొంతమంది సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జరగకూడనిది జరిగితే ఎవరు బాధ్యలంటూ వివరించారు.

29 దుకాణాలకు అనుమతులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో 29 టపాసుల దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ తెలిపారు. మరికొంత మంది కూడా షాపుల నిర్వహణకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఆ దరఖాస్తులను కూడా పరిశీలించి అనుమతులిచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు కూడా నిబంధనలు అతిక్రమించకుండా విక్రయించుకోవాలని సూచించారు. అలాగే చిత్తూరు రూరల్ పరిధిలో రెండు దుకాణాలకు అనుమతులు ఇచ్చామని రూరల్ తహసీల్దార్ జయప్రకాష్ చెప్పారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరి భగవాన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్ : ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి భగవాన్ జయంతి వేడుకలు శనివారం నగరంలోని 37వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ధన్వంతరి భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల జీవనోపాధికి భద్రత కల్పించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గ్రీన్ అంబాసిడర్ల జీవనోపాధికి భద్రత కల్పించాలని శానిటరీ వర్కర్స్ యూనియన్ నాయకులు మనోహర్, అరవింద్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని రూరల్ రెవెన్యూ కార్యాలయంలో శనివారం గ్రీన్ అంబాసిడర్స్ సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ జయప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రీన్ అంబాసిడర్ల విధులను నిర్వహిస్తున్న..వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

నేడు జీఎస్టీ అవగాహన కార్యక్రమం ముగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహించిన జీఎస్టీ 2.0 అవగాహన కార్యక్రమాలు ఈ నెల 19న ముగింపు కానున్నాయని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 వల్ల ధరలు తగ్గి వినియోగదారులకు ఊరట కలిగిస్తున్నాయన్నారు. నెల రోజులుగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఆదివారంతో ముగుస్తున్నాయన్నారు. ముగింపు కార్యక్రమం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న పూలే భవనంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

చీకట్లను పారదోలే.. వెలుగుల దీపావళి



టపాసుల దుకాణం(ఫైల్)

జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ దివ్య దీపావళి. చీకటిని పారదోలి వెలుగులు నింపే పండగగా, విజయానికి ప్రతీకగా దీపావళిని ఏటా అశ్వయుజ మాసంలో అమావాస్య రోజున జరుపుకోవడం ఆనవాయతీ. అయితే దీపావళిని వేడుకగా జరుపుకునే క్రమంలో చాలా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి పలువురు గాయపడుతున్నారు. జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

- టపాసులను కాల్చేటప్పుడు నిఘాతో ఉండాలి
- బాణసంచా నిల్వ చేసేటప్పుడు తస్మాత్ జాగ్రత్త
- క్రాకర్స్ కొనుగోలు చేసేటప్పుడు నిశిత పరిశీలన తప్పనిసరి
- ఏమరుపాటుగా ఉంటే ప్రమాదం తప్పదంటున్న నిపుణులు
- చిన్నారులు బాణసంచా పేల్చే సమయంలో పెద్దలు జాగ్రత్తలు పాటించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం)/బంగారుపాళెం : ప్రతి ఇంటా దీపావళి వెలుగులు నిండాలి. అయితే పండుగ నాడు టపాసులు పేల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. టపాసులు కాల్చేటప్పుడు అజాగ్రత్తగా ఉంటే బాణసంచాలోని రసాయనాలతో కళ్లు దెబ్బతింటాయి. సల్ఫర్, గన్‌పౌడర్ లాంటి రసాయనాల ప్రభావం వల్ల కళ్ల నుంచి నీరు కారడం, కళ్ల మంటలు, దురద వంటి ప్రభావాలు ఉంటాయి. ఒక్కోసారి కళ్లు పూర్తిగా కనబడకుండాపోతాయి. రూ.లక్షల విలువైన సరుకును ఎలాంటి అనుమతులు లేకుండా దిగుమతి చేసుకుని నిల్వలు ఉంచుతున్నారు. పండుగ రోజు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కొందరైతే ఏకంగా నివాస ప్రాంతాల మధ్య నిబంధనలు పాటించకుండా నిల్వ చేస్తున్నారు. అలాగే తాత్కాలికంగా అనుమతులు తీసుకున్న దుకాణాల వ్యాపారులు మిగిలిన సరుకును కొన్నచోటకే తిరిగి పంపాల్సి ఉంటుంది. కానీ కొందరు అలా చేయడం లేదు. పలుచోట్ల గుట్టుగా నిల్వ చేసి ఇతర సమయాల్లోనూ అమ్మేస్తున్నారు. కొందరైతే ఎలాంటి అనుమతులు లేకపోయినా పొరుగు ప్రాంతాల నుంచి పేలుడు పదార్థాలు తెప్పించి ఇళ్లలోనే టపాసులు తయారు చేస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు స్పందించి తనిఖీలు చేయకపోతే అనుమతి లేని వారు విక్రయాలతో పాటు చేసే నిల్వలతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.



టపాకాయల దుకాణం

అప్రమత్తంగా ఉండాలి

పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

- గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాలు, గడ్డివాములు, పూరిగుడిసెలు అధికంగా ఉంటాయి. అటువంటి ప్రాంతాల్లో రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటివి కాల్చరాదు
- పండుగ ఆనందంలో పిల్లల పట్ల ఏమాత్రం అజాగ్రత్త వహించరాదు
- కొంతమంది కొన్నిరకాల టపాసులను రోడ్లపై పేల్చేందుకు ప్రయత్నిస్తారు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.

జాగ్రత్తలు ఇలా..

- టపాసులు వెలిగించిన వెంటనే దూరంగా జరగాలి
- పేలని టపాసులపై వంగి చూడడం మంచిది కాదు
- కంటికి రక్షణగా ప్లేన్ అద్దాలు వాడడం మంచిది
- పేరున్న సంస్థలు తయారు చేసిన టపాసులనే ఎంపిక చేసుకోవాలి
- పిల్లలు, యువకులు, మహిళలు ఇలా ఎవరు ఏరకం టపాసులు కాల్చాలో ముందే నిర్ణయించుకుని ప్రణాళిక మేరకే కొనాలి
- ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలి
- బాణసంచాను కిచెన్, పొయ్యి ఉన్న ప్రాంతాల్లో ఉంచకూడదు
- బాణసంచా కాల్చేటప్పుడు వదులుగా ఉన్న దుస్తులు ధరిస్తే అవి వేలాడుతూ అంటుకునే ప్రమాదం ఉంది. కొద్దిగా బిగుతైన కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి
- చిన్న పిల్లలను ఎత్తుకుని బాణసంచా కాల్చకూడదు. పెద్ద వారి సహాయం లేకుండా పిల్లలు వారంతట వారే బాణసంచా కాల్చరాదు
- అప్పుడే పుట్టిన చిన్నారులు, గర్భిణులు, వృద్ధులపై బాణసంచా శబ్దాలు ఎక్కువ ప్రమాదం చూపుతాయి. ప్రధానంగా చెవులు దెబ్బతింటాయి. చెవులను రక్షించుకోవడానికి ఇయర్ ప్లగ్స్ కొంతమేరకు ఉపయోగపడతాయి. పెద్ద శబ్దాలతో పేలే టపాసులు కాకుండా చాలా తక్కువ శబ్దంతో పూలలాంటి వెలుగులు కురిపించే చిచ్చుబుడ్లు, కాకర పువ్వొత్తులు, పెన్సిళ్లు, భూచక్రాలు వంటివి కాల్చడం మంచిది. భూచక్రాలు, బొట్లు కూడా ఒక్కోసారి పేలే ప్రమాదం ఉంది. వాటిని అగ్గిపుల్లలతో కాకుండా కాకర పువ్వొత్తులతో కాల్చడం మంచిది.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్త..



పెద్దవాళ్ల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణసంచా కాల్చడం ఉత్తమం. టపాసులు కాల్చేటప్పుడు నీళ్ల దగ్గర పెట్టుకోవాలి. ఇంటి కిటికీలు, తలుపులు మూసివేయాలి. దీపావళి పండుగ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలాగే ఏ విధమైన అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున, ఎస్ఐ, చిత్తూరు తాలూకా

అప్రమత్తంగా వ్యవహరించాలి



ప్రమాదాలనేవి ప్రారంభంలో చిన్నవిగానే ఉంటాయి. అందుచేత అనుమానం రాగానే చుట్టుపక్కల ఉన్న వారు సైతం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న వనరులతో సాధ్యమైనంత వరకు ప్రమాద నివారణకు ప్రయత్నించాలి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

– కత్తి శ్రీనివాసులు, సీఐ, బంగారుపాళెం

శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



స్వామివారిని దర్శించుకుంటున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మురకంబట్టు శ్రీసుందర వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పట్టువస్త్ర సమర్పణ చేశారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సత్య, కుట్టి, గణేష్, అరుణ్, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేయనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని దివ్యాంగులకు పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్, జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో సమర్థ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రొస్తెటిక్స్, ఆర్థోటిక్స్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో 70 దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేయనున్నట్లు తెలిపారు. అవయవాలకు 9989206667 నంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేయాలని కోరారు.

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజ

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి ప్రదోషకాల పూజను శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత స్వామివారి మూల విరాట్‌కు, నందీశ్వరుడికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టగా, భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఈ పెంచల కిషోర్, ఏఈఈ రవీంద్రబాబు, సిబ్బంది వాసు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ కమిటీల పేరుతో కాలయాపన సరికాదు

– వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి విమర్శ



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై మంత్రివర్గ కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రివర్గ ఉపసంఘంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒరిగేదేమి లేదని మండిపడ్డారు. ఆర్థిక ఇబ్బందులు ప్రభుత్వానికే కాదు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సైతం ఉంటాయన్న విషయాన్ని కూటమి ప్రభుత్వం గ్రహించాలన్నారు. కూటమి ప్రభుత్వం తీరు వల్ల పండుగల వేళ ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల సీఎంకు సానుకూల వైఖరి ఉంటే తక్షణమే 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించి మధ్యంతరభృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తనకున్న విచక్షణాధికారాలతో తక్షణమే రెండు డీఏలను ప్రకటించాలన్నారు. సరెండర్ లీవుల బకాయిలు, సీపీఎస్ ఉద్యోగులకు 90 శాతం డీఏ ప్రకటించాలని కోరారు. టీచర్లకు బోధన తప్ప, బోధనేతర పనులను లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే టీచర్లను నియమించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసే తేదీ నాటికే ఉద్యోగ, ఉపాధ్యాయులకు కమ్యూటేషన్, గ్రాట్యూటీ, పెన్షన్ మంజూరు చేయాలన్నారు. టెట్ మినహాయింపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పీఎం జన్ ఆరోగ్య యోజన లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్

తవణంపల్లె: మండలంలో ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్యక్రమం లక్ష్యాలను పూర్తి చేయాలని ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి వయో వందన కార్యక్రమాలపై వైద్యసిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. 104 వైద్య సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు రెడ్డెమ్మ, గోపి, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ పోటీల్లో నరహరిపేట విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుడిపాల: స్కూల్ గేమ్స్ పోటీల్లో నరహరిపేట విద్యార్థులు విజయకేతనం సాధించినట్లు నరహరిపేట పాఠశాల హెచ్ఎం దూర్వాసులు తెలిపారు. శనివారం నరహరిపేట హైస్కూల్‌లో అండర్-17, 19 జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ఇందులో బాలికలు అండర్-17 ఫ్రీస్టైల్ విభాగంలో 10వ తరగతి విద్యార్థిని మహాలక్ష్మి 45 కేజీల విభాగంలో మొదటిస్థానం సాధించింది. బాలికలు అండర్-19 ఫ్రీస్టైల్ విభాగంలో ఇంటర్ విద్యార్థిని శరణ్య 76 కేజీల విభాగంలో మొదటిస్థానం సాధించింది. బాలుర విభాగంలో అండర్-17 కేటగిరిలో 48 కేజీల విభాగంలో 10వ తరగతి విద్యార్థి గోవర్ధన్ గిరి మొదటిస్థానం, అండర్-19 కేటగిరిలో 80 కేజీల విభాగంలో 10వ తరగతి విద్యార్థి జయచంద్ర మొదటిస్థానం సాధించారన్నారు. గ్రీకో రోమ్ విభాగంలో అండర్-17 కేటగిరిలో 60 కేజీల విభాగంలో 10వ తరగతి విద్యార్థి పురుషోత్తం మొదటిస్థానం, అండర్-19లో 60 కేజీల విభాగంలో 10వ తరగతి చైతన్య ప్రసాద్ మొదటిస్థానం సాధించారన్నారు. వీరందరూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

హోటల్‌లో తినొచ్చే సరికి ద్విచక్రవాహనం చోరీ

గుడిపాల: ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన వెలుగు చూసింది. వివరాలు.. మండలంలోని 197రామాపురం దగ్గర ఉన్న సంఘం డెయిరీలో మహేష్ అనే వ్యక్తి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో నరహరిపేట సమీపంలోని మయూరి గ్రాండ్ హోటల్‌లో తినేందుకు తన హీరోహోండా స్ప్లెండర్ ఏపీ03బీఎస్8666 బైక్‌లో వచ్చాడు. హోటల్ బయట ద్విచక్ర వాహనాన్ని వదిలి లోపలకు వెళ్లి తిని వచ్చే సరికి బైక్ లేదు. గుర్తు తెలియని వ్యక్తి బైక్ చోరీ చేసిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. అతను చిత్తూరు వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై బాధితుడు గుడిపాల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

ఆకతాయిల మాటలు నమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: కొత్తగా పరిచయయయ్యే ఆకతాయిల మాటలు నమ్మి మోసపోరాదని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత యువతులకు సూచించారు. పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే సమయంలో కొత్త వారితో పరిచయాలు చేసుకోరాదని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో పరిచయాలు పెను ప్రమాదమని హెచ్చరించారు. మోసపోయి బాధలు పడే బదులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ఎం విజయకుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



భజన చేస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాగంణంలో భజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ దాదాపు 10 ఏళ్లుగా ప్రతి శనివారమూ అఖండ హరి నామస్మరణతో భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



విరిగి పడిన విద్యుత్ స్తంభం, బోల్తా పడిన కారు

చౌడేపల్లె: మండలంలోని అట్లవారిపల్లె సమీపంలో చెరువు కట్ట వద్ద శనివారం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు.. కోలారుకు చెందిన యువకుడు కారులో బోయకొండ మీదుగా మదనపల్లె వైపు వెళ్తున్నాడు. అట్లవారిపల్లె సమీపంలో కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో ఇతర వాహనాల రాకపోవడం, విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వలంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టపాసుల ధరలే.. ధామ్‌మంటున్నాయ్



చిత్తూరు నగరంలో ఏర్పాటైన టపాసుల దుకాణాలు

టపాసులు ధరలు ధామ్‌మ్..అంటున్నాయి. అగ్గిపెట్టె నుంచి తౌజండ్ వాలా వరకు ధరలు పేలుతున్నాయి. ధరలు చూసి ప్రజలు బిత్తరపోతున్నారు. వ్యాపారాలు ర్యాకెట్‌లా దూసుకెళ్తున్నాయి. టపాసుల దుకాణదారులకు కాసులు గలగలమంటున్నాయి. అయితే నిబంధనలు మాత్రం గాలికొదిలేశారు. అధికారులు అధికారానికి తలొగ్గి..నిబంధనలను కాలరాశారు. దీంతో చిత్తూరు నగరంలోని మామిడికాయల మార్కెట్ యార్డులో శనివారం పెట్టిన టపాసుల షాపు ప్రమాదకరంగా ఉంది.

- చిత్తూరులోని మామిడికాయల మార్కెట్‌లో టపాసుల విక్రయ దుకాణాల ఏర్పాటుకు అనుమతి
- నిబంధనలను గాలికి వదిలేసిన నిర్వాహకులు
- ఇష్టారీతిన రేట్లు పెంచి విక్రయాలు
- గిఫ్ట్ బాక్స్‌ల కోసం అధికారుల పాట్లు
- మరోవైపు సాధారణ ప్రజల నడ్డి విరుస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు నగరంలో గతేడాది మురకంబట్టు ప్రాంతంలో టపాసుల విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈసారి చిత్తూరు నగరంలోని మామిడికాయల మార్కెట్‌లో విక్రయాల కేంద్రాలు పెట్టారు. ఇక్కడ 28 షాపులకు అధికారికంగా అనుమతులొచ్చాయి. వ్యాపారులు భారీ అంచనాల నడుమ షాపులను ఏర్పాటు చేశారు. కొద్దిపాటి పెట్టుబడితో లక్షలాది రూపాయలు సంపాదించాలని చాలామంది ఈ షాపులను పోటీపడి పెట్టుకున్నారు.

ముందు షాపులకు ప్రజాప్రతినిధుల సిఫార్సులు సైతం తీసుకున్నారు. ఇక అక్కడ టపాసులు ధరలు మోత మోగుతున్నాయి. పిల్లలు ఇష్టపడి కాల్చే కాకరపువ్వొత్తులు సాదా బాక్స్ ధర మంచి కంపెనీ అయితే రూ. 15 నుంచి రూ.200 వరకు ఉంది. చిచ్చుబుడ్డీలు చిన్నవి పది ఉండే బాక్స్ రూ.100 నుంచి రూ. 120 ఉంది. అదే పెద్దవి అయితే మంచి కంపెనీ రూ.400 వరకు పలుకుతోంది. తాళ్ల చిన్న పెట్టె రూ.50, పెద్దవి రూ.100, సీమటపాసులున్న చిన్నబాక్స్ రూ.60 పలుకుతోంది. భూ చక్రాలు రూ.150 నుంచి రూ.200 దాకా ఉంది. 5000వాలా రూ.1,500 నుంచి రూ.2000 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి.

అధికారులు గుంజేశారు..

టపాసులు విక్రయానికి అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చినప్పటి నుంచి అధికారులు విక్రయదారులను పిండేశారనే పలువురు విక్రయదారులు ఆరోపిస్తున్నారు. లైసెన్స్ చేతికొచ్చే సరికి ప్రాణం పోయినట్ల అయిందని వాపోతున్నారు. ప్రతి శాఖకు ముడుపుల మర్యాదలు చేయాలంటే ఎలా అంటూ మండిపడ్డారు. వాళ్లకు ఇచ్చిన దాంతో పాటు పెట్టుబడి పెట్టిన ఆదాయంపై 20శాతం లాభం వస్తే చాలని ఈ వ్యాపారం పెట్టామని వారు వాపోతున్నారు.

నిబంధనలకు నీళ్లు..

మామిడి కాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పలు షాపుల్లో నిబంధనలు సక్రమంగా పాటించడం లేదు. వాళ్ల ఇష్టానుసారంగా ఏర్పాటు చేసుకున్నారు. నిబంధనలను విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలకు తావిస్తోంది. రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడ నిబంధనలు పాటించేలా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.